క్లుప్తంగా

జయితి ఆలయాన్ని దర్శించిన న్యాయమూర్తులు



శివలింగానికి పాలాభిషేకం చేస్తున్న జిల్లా అదనపు న్యాయమూర్తి విజయ కళ్యాణి, గజపతినగరం సివిల్ జడ్జి కనకలక్ష్మి

మెంటాడ: మండలంలోని జయితి గ్రామంలోని భ్రమరాంభిక సహిత మల్లికార్జున స్వామి ఆలయాన్ని జిల్లా అదనపు నాయ్యయమూర్తి విజయ కళ్యాణి, గజపతినగరం సివిల్ జడ్జి కనకలక్ష్మి శనివారం దర్శించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చాపాన జోగినాయుడు పూర్ణ కుంభంతో స్వాగతం పలకగా, ఆలయ అర్చకుడు దుడ్డి శ్రీనివాసులు పూజలు, అభిషేకాలు జరిపించారు. ఆలయ విశిష్టతను తెలియజేశారు.

చిన్నారులకు సులభ పద్ధతుల్లో బోధన



అంగన్‌వాడీ కార్యకర్తలకు టీఎల్‌ఎం వినియోగాన్ని వివరిస్తున్న డీఆర్‌పీలు

రేగిడి: చిన్నారులకు చిన్నచిన్న పదాలతో చదువు నేర్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు డీఆర్‌పీలు శ్యామసుందర్, ఏనుగుతల కిషోర్ సూచించారు. రేగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి శిక్షణలో భాగంగా బోధన మెలకువలు వివరించారు. బోధనలో టీఎల్‌ఎం(టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్)ను వినియోగించాలన్నారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈఓ ఎం.వి.ప్రసాదరావు

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ ఎం.వి.ప్రసాదరావు శనివారం తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. ఉపాధ్యాయుల బోధన పద్ధతులపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజన పథకం పరిశీలించి, మెనూ పక్కాగా అమలుచేయాలని హెచ్‌ఎం రోజారమణికి సూచించారు.

వ్యవసాయ సేవలు సులభతరం



తాలాడ రైతు సేవా కేంద్రంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి రామారావు

సంతకవిటి /రేగిడి: వ్యవసాయ సేవలను సులభతరం చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి వీటీ రామారావు తెలిపారు. తాలాడ, వెంకంపేట సచివాలయంలో రైతులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు పారదర్శకంగా సేవలందించేందుకు ప్రతి రైతుకు 11 అంకెల గల విశిష్ట నంబర్‌ను కేటాయిస్తున్నట్టు వెల్లడించారు. పంచాయతీల్లోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి, రైతు గుర్తింపు సంఖ్యను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓలు పైల నవీన్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

నేడు మహా అన్నసమారాధన

రాజాం: పట్టణంలోని గాయత్రీకాలనీలో గాయత్రీదేవి ఆలయం వద్ద ఆదివారం మహా అన్నసమారాధన జరగనుందని ఆలయ ధర్మకర్తలు కొండవీటి తేజోమూర్తి, కొండవీటి వివేకానందరావు తెలిపారు. ఈ నెల 19 నుంచి 21 వరకు నిర్వహించిన ఆలయ 32వ వార్షికోత్సవ యాత్రలో భాగంగా భక్తులకు అన్నసమారాధనను ఏర్పాటుచేసినట్టు వెల్లడించారు.

తడి, పొడిచెత్త వేర్వేరుగా సేకరించాలి



ఒమ్మిలో చెత్తసేకరణపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం: గ్రామాల్లో తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేర్వేరుగా సేకరించాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు క్లాప్‌మిత్రలను ఆదేశించారు. మండలంలోని ఒమ్మి పంచాయతీలో చెత్తసేకరణను శనివారం ప్రారంభించారు. ఇంటింటికీ మూడు చొప్పున చెత్త బుట్టలను అందజేశారు. నీలంరంగులో పొడిచెత్త, ఆకుపచ్చరంగులో తడిచెత్త, ఎరుపురంగు బుట్టలో ప్రమాదకర చెత్తను వేయాలని గ్రామస్తులకు సూచించారు. వీధివీధికీ వచ్చిన క్లాప్‌మిత్రలకు చెత్తను అందజేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి.సీతారాం, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అరటి సాగుపై ఆసక్తి

- రాజాం, వంగర మండలాల్లో 150 ఎకరాల్లో సాగు



రాజాం మండలం సోపేరులో సాగులో ఉన్న అరటి

రాజాం: రైతులు తోట, వాణిజ్య పంటల సాగుపై మక్కువ చూపుతున్నారు. నీటి వనరుల లభ్యత, నేలసారం, పెట్టుబడులు, పంటల డిమాండ్‌ను పరిగణలోకి తీసుకుని ముందుకు'సాగు'తున్నారు. రాజాం మండలంలో సోపేరు, గా్రరాజచీపురుపల్లి, బొద్దాం, వంగర మండలంలోని ఇరువాడ, కింజంగి, కొతులగుమ్మడ, సంగాం ప్రాంతాల్లో సుమారు 150 ఎకరాల్లో అరటిపంట సాగులో ఉంది. సంతకవిటి, రేగిడి మండలాల్లో అక్కడక్కడ పంట దర్శనమిస్తోంది. గతంలో వరి పంటను సాగుచేసే రైతులు ఇప్పుడు అరటిపంటను సాగుచేస్తున్నారు.

రెండేళ్ల పంట...

అరటి పంట సాగుకు పెట్టుబడి ఎక్కువ. వాతావరణం కూడా కలిసిరావాలి. తుఫాన్ల ప్రభావం ఉండకూడదు. అన్నీ కలిసొస్తే రెండేళ్ల పాటు ఆదాయం బాగుంటుందని రైతులు చెబుతున్నారు. యాజమాన్య పద్ధతులు పాటించడంతో పాటు గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లోని విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్‌ల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చంటున్నారు. ఎకరా విస్తీర్ణంలో పంట సాగుకు పెట్టుబడి రూ.30వేలు దాటి ఉంటుంది. పంట నాణ్యతతో దిగుబడి వస్తే ఎకరాకు 15 టన్నుల దిగుబడి ఉంటుంది. అరటికి ప్రస్తుతం డిమాండ్ ఉండడం, రాజాంలో కూడా మార్కెట్ ఉండడంతో ఎకరా సాగులో ఖర్చులు పోను రూ. 50 వేలు దాటి ఆదాయం పొందవచ్చు. రాజాం నియోజకవర్గంలో ఎక్కువగా రాజమండ్రి నుంచి తీసుకొచ్చిన కర్పూర, అమృతపాణి, చెక్కెరకేలి రకం అరటితోటలను రైతులు సాగుచేస్తున్నారు. ఎకరాలో 650కిపైగా మొక్కలు నాటి ఆదాయం వైపు దృష్టిసారిస్తున్నారు. రెండో పంటకు తొలిపంట పిలకలు ఉపయోగపడడంతో పాటు పూత అనంతరం చెట్టు నరకగా వచ్చే పిలకలు ఇతర రైతులకు విక్రయించుకునేందుకు ఉపయోగపడుతున్నాయి.



పూత దశలో అరటిపంట



వంగర మండలం ఇరువాడ వద్ద అరటి తోటలు

పంట మార్చుదామని...

నిత్యం వరి సాగుచేసేవారం. కొత్తరకం పంట సాగుచేద్దామన్న ఉద్దేశంతో కర్పూర రకం అరటితోట సాగుచేస్తున్నా. గెల మధ్యస్తంగా ఉంది. ఒక్కో గెల రూ. 150 నుంచి రూ.170 మధ్య అమ్ముడుపోతోంది. విత్తనం నాటే విధానం, సాళ్ల ఏర్పాటు, యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి వస్తుంది.

– కె.వెంకటరమణ, రైతు, సోపేరు, రాజాం మండలం

దిగుబడి బాగుంది

మా పొలాలు అరటితోటల సాగుకు అనుకూలం. నాణ్యతతో కూడిన పండ్ల దిగుబడి వస్తోంది. ఈ దఫా వాతావరణం అరటి పూతకు సహకరించింది. ఎకరా సాగులో రూ.30 వేలు దాటి ఆదాయం వస్తుందని ఆశిస్తున్నాం.

– పి.రామప్పుడు, అరటి రైతు, ఇరువాడ, వంగర మండలం

యాజమాన్య పద్ధతులు పాటించాలి

అరటి సాగుచేసే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి. విత్తన ఎంపిక నుంచి గెల వచ్చేవరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ఎకరాకు 1000 వరకు మొక్కలు వేయవచ్చు. రైతులకు అరటిసాగుపై అవగాహన కల్పిస్తున్నాం, సాగుచేసిన రైతులకు ప్రస్తుతం నష్టంలేదు.

– ఎ.ఉమామహేశ్వరి, ఉద్యాన వనశాఖ అధికారి, రాజాం

ఆటపాటలతో కూడిన విద్యను బోధించాలి



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను బోధించాలని ఎంఈఓలు త్రినాథరావు, పాపారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉషారాణి, వెంకటలక్ష్మి అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. 'జ్ఞానజ్యోతి' కార్యక్రమంలో భాగంగా తెర్లాంలోని ఉన్నత పాఠశాలలో ఆ మండల పరిధి అంగన్‌వాడీ కార్యకర్తలకు నాలుగురోజులుగా నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణ శనివారం కొనసాగింది. ప్రీస్కూల్ పిల్లలకు బొమ్మలతో ఏవిధంగా బోధించాలి, పేపర్లు, ఆకులతో బొమ్మలు తయారు చేయడం, రంగుల పెన్సిల్స్‌తో బొమ్మలు వేయించడం, ప్రీస్కూల్ పిల్లల పుట్టినరోజు వేడుకలు ఏవిధంగా నిర్వహించాలో శిక్షణ ఇచ్చారు.

–తెర్లాం

కల్లాం కాదు.. రోడ్డే..!



తెర్లాం మండలంలోని పలు గ్రామాల బీటీ రోడ్లు పంట నూర్పిడి, ఆరబోత కల్లాలుగా దర్శనమిస్తున్నాయి. రైతులు రోడ్లపై మినప, పెసర పంటలతోపాటు, చోడి(రాగులు), మొక్కజొన్న తదితర పంటలను ఆరబెడుతున్నారు. లింగాపురం-నందిగాం రహదారిలో అయితే కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లడానికి వీలు లేకుండా రోడ్డంతా మొక్కజొన్న గింజలను ఆరబెట్టారు. రోడ్లపై పంట దినుసులు ఆరబెట్టడం వల్ల ద్విచక్ర వాహనాలు జారిపోయే ప్రమాదం ఉందని వాహన చోదకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

– తెర్లాం

ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటుపై నిర్ణయం తీసుకోండి

- మాజీ ఎమ్మెల్యే శంబంగి డిమాండ్

బొబ్బిలి: పంట ఉత్పత్తుల ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటుపై శాసన సభ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు దయనీయ పరిస్థితుల్లో ఉన్నారన్నారు. పంటలకు సరైన ధర లేక అల్లాడిపోతున్నారని ఆవేదన చెందారు. జిల్లాలో దాదాపు 24వేల మెట్రిక్ టన్నుల ధాన్యం అటు మిల్లుల్లోనూ, ఇటు రైతుల కల్లాల్లోనూ ఉండిపోయి ఏం చేయాలో పాలుపోక అవస్థలు పడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆర్‌బీకేల ద్వారా, వలంటీర్లు సైతం సహాయం చేస్తూ రైతుల నుంచి ధాన్యం సేకరణ సకాలంలో చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసేందుకు కంకణం కట్టుకుందని మండిపడ్డారు. రైతులు తమకు నచ్చిన మిల్లులకు ధాన్యం తరలించుకోవచ్చని ప్రభుత్వం చెప్పిందని, తీరా తరలించాక మిల్లర్లకు బ్యాంకు గ్యారంటీలు చాలవని ధాన్యం వివరాలను ఆన్‌లైన్ చేయలేదన్నారు. మిల్లులకు తీసుకువచ్చిన ధాన్యం తిరిగి తీసుకెళ్లండి, లేకుంటే మేం చెప్పిన ధరకు ఇవ్వాలని రైతులతో మిల్లర్లు చెబుతుండడంతో వారికి ఏం చేయాలో అర్థం కాక సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రూ.3కోట్ల ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేశామని, ధర తగ్గిపోయినా రైతుల నుంచి పంట కొనుగోలు చేశామన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదని, కూటమి ప్రభుత్వంలోని పెద్దలు, మంత్రులుచ ఎమ్మెల్యేలు ఎప్పుడూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై ఏడవడమే తప్ప ప్రజలకు చేసిన సంక్షేమేమీ లేదని ఆరోపించారు. గుంటూరు మిర్చి యార్డు కన్నా రాష్ట్రంలో పెద్ద యార్డులు లేవని, అలాంటి చోటే ధరలు లేక రైతులు బోరుమంటున్నారన్నారు. జిల్లాలోని లచ్చయ్యపేట సుగర్ ఫ్యాక్టరీ, భీమసింగి సహకార చక్కెర కర్మాగారాలు మూతపడడంతో చెరకు పంటను సంకిలి తరలించలేక రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. గతంలో వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు నాయుడు అప్పటి మాటకే కట్టుబడి ఆయన విధానాలను కొనసాగిస్తున్నట్టు స్పష్టమవుతుందని ఎద్దేవా చేశారు. ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి బొద్దల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి భమిడిపాటి విశ్వనాథశర్మ, తెర్లాం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తెంటు సత్యం నాయుడు,తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



శంబంగికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ అధిష్టానం అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని పార్టీ జిల్లా కమిటీ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పల నాయుడు సూచించారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కమిటీ కార్యాలయం జగన్నాథపురానికి చెందిన బొద్దల సత్యనారాయణను జిల్లా ప్రచార కార్యదర్శిగా, రాముడువలస గ్రామానికి చెందిన భమిడిపాటి విశ్వనాథ శర్మను జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ రెండు రోజుల క్రితం ఉత్వర్వులు విడుదల చేసింది. వీరిరు వురూ బొబ్బిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే శంబంగిని శనివారం మర్యాద పూర్వ కంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు, తెర్లాం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తెంటు సత్యం నాయుడు, న్యాయవాది రుంకాన ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

• పోలింగ్ కేంద్రాల పరిశీలన



బొబ్బిలిలోని పోలింగ్ కేంద్రం వద్ద ఆర్డీఓ రామమోహనరావు, తదితరులు



తెర్లాంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌ఓ మధుసూదనరావు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈనెల 27న నిర్వహించనున్నారు.బొబ్బిలి నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలను అధికారులు శనివారం పరిశీలించారు. బొబ్బిలిలోని గొల్లపల్లి వద్ద ఉన్న శ్రీ వేణుగోపాల మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీఓ జె.వి.వి.ఎస్.రామమోహనరావు,బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండల కేంద్రాల్లోని ఉన్నత పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సెక్టోరియల్ అధికారి, జిల్లా పౌరసరఫరాల అధికారి (డీఎస్‌ఓ) కె.మధుసూదనరావు సందర్శించారు. కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, ప్రహరీలు, రక్షణ, ఇతర ఏర్పాట్లను పరిశీ లించి, తహసీల్దార్‌లు, పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. నియోజకవర్గంలోని నాలుగు పోలింగ్ కేంద్రాల్లో 803 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

– బొబ్బిలి/బాడంగి/తెర్లాం/రామభద్రపురం

ఆయుర్వేద వైద్యంతో ఆరోగ్యం



ఖండ్యాంలో ఆయుర్వేద మందుల్ను అందజేస్తున్న వైద్యాధికారి సునీల్‌కుమార్

రేగిడి: ఆయుర్వేద వైద్యంతో ఆరోగ్యసమస్యలను దూరం చేసుకోవచ్చని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి సునీల్‌కుమార్ అన్నారు. ఖండ్యాం గ్రామంలో శనివారం ఆయుర్వేద వైద్యశిబిరాన్ని నిర్వహించారు. మహిళలు ఆరోగ్యానికి సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు బూసి ప్రసాద్, చక్రధర్, సింహాచలం, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలతోనే ఉజ్వల భవిష్యత్

తెర్లాం: విద్యార్థుల జీవితంలో పదోతరగతి చాలా కీలకమని, ఇక్కడ ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎస్‌ఐ సాగర్‌బాబు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రమేష్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు శనివారం ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ పరీక్షలకు తక్కువ సమయం ఉందని, సమయం వృథా చేయకుండా ప్రణాళికతో చదువుకోవాలని సూచించారు. అన్ని సబ్జెక్టులకూ సమయం కేటాయించి పరీక్షలు ప్రారంభమయ్యే లోగా మరోసారి రివిజన్ చేసుకోవాలని, ఏసబ్జెక్ట్‌లోనైనా సందేహాలు ఉంటే సంబంధిత ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



శంబంగిని ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బొబ్బిలి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, సన్మార్గానికి ఆధ్యాత్మిక చింతన బాటలు వేస్తుందని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గల దాసాంజనేయ స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ శనివారం నిర్వహిం చారు. కార్యక్రమానికి హాజరైన శంబంగికి ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆంజనేయ స్వామిని దర్శిం చుకుని పూజలు చేశారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కొంత సమయం కేటాయించాలన్నారు. దాదాపు వందేళ్ల చరిత్ర ఉన్న దాసాంజనేయస్వామి ఆలయం జీర్ణావస్థకు చేరడంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే శంబంగి దేవదాయ శాఖ జిల్లా అధికా రులు, రాష్ట్ర కమిషనర్‌ను సంప్రదించి సీజీఎఫ్ నిధులు రూ.50లక్షలు వచ్చేలా కృషి చేశారు. ఈనిధులతో పాటు ఆలయ కమిటీ సభ్యులు పట్టణ ప్రముఖుల నుంచి విరాళాలు సేకరించి ఆలయ పునర్నిర్మాణం చేశారు.

పరీక్షలని ఒత్తిడికి గురికావొద్దు

బొబ్బిలి: పబ్లిక్ పరీక్షలని ఒత్తిడికి గురికావద్దని, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్, మాజీ ఎంపీ డాక్టర్ డి.వి.జి.శంకరరావు పదోతరగతి విద్యార్థినులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను శనివారం రాత్రి సందర్శించి స్టడీ అవర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ఆయన ముఖాముఖి నిర్వహించి వారిలో ఒత్తిడి, ఆందోళన లేకుండా ఉండేందుకు కాసేపు కౌన్సిలింగ్ ఇచ్చారు. వారికి అందుతున్న ఆహారం గూర్చి, స్టడీ మెటీరియల్ ఇచ్చారా లేదా అని ఆరా తీశారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించారు. బాలికల ఉన్నత పాఠశాల అయి ఉండీ ఇక్కడ వాచ్‌మన్ లేకపోవడాన్ని గుర్తించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడుతానన్నారు.

సంక్షిప్తంగా

దీపట్టా భూముల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ హేమంత్‌కుమార్

తెర్లాం: మండలంలోని పెదపాలవలస గ్రామంలో దీపట్టా భూములను తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఇన్నాళ్లు దీపట్టా భూములను సాగు చేసుకుంటున్న వారు ఆ భూములను వేరే వ్యక్తులకు విక్రయించేశారని తెలియడంతో మండల సర్వేయర్ సాయితో కలిసి తనిఖీలు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ రికార్డుల్లో దీపట్టా భూములు ఎవరి పేరున ఉన్నాయి, వారికి ఏవిధంగా సక్రమించాయనే దానిని పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తామని తెలిపారు. ప్రభుత్వ భూములు ఆక్రమించినా, దీపట్టా భూముల క్రయ విక్రయాలు చేసినా చర్యలకు వెనుకాడేదిలేదని స్పష్టంచేశారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి

బొబ్బిలి రూరల్: మండలంలోని కృపావలస, దీవెనవలస, రామన్నవలస, సియోనువలస, చిన అక్కేనవలస గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న అన్నారు. ఆయా గ్రామాల గిరిజనులతో కలిసి మండల కేంద్రంలో తహసీల్దార్ ఎం.శ్రీనును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అప్పన్న మాట్లాడుతూ ఈ గిరిజన గ్రామాలను సమీపంలోని గ్రామపంచాయతీల్లో కలపాలని కోరారు. విద్యుత్ సౌకర్యం లేక రాత్రివేళల్లో పాములు, విషపూరిత కీటకాలతో గిరిజనులు సహజీవనం చేస్తున్నారని, సదుపాయాలు కల్పించాలని అభ్యర్థించారు.

కొలతల ప్రకారం పనిచేయాలి

రామభద్రపురం: వేతనదారులు ఉపాధి హామీ సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పని చేయాలని ఏపీఓ త్రినాథరావు సూచించారు. మండలంలోని నాయుడువలసతో పాటు పలు గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. వేతనదారులు మస్టర్ల సీట్లను తనిఖీ చేశారు.వేతనదారులతో ఆయన మాట్లాడుతూ రోజూ ఆరు గంటలు పనిచేయాలని, కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.300 చొప్పున వేతనం అందుతుందన్నారు.

ధాన్యం కొనుగోలు చేయడంలేదు



ధాన్యం కొనుగోలు సమస్యను ఎమ్మెల్సీ విక్రాంత్‌కు వివరిస్తున్న ఖండ్యాం రైతులు

రేగిడి: ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఖండ్యాం, వెంకటాపురం రైతులు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌కు విన్నవించారు. ఖండ్యాం గ్రామం వెళ్లిన ఎమ్మెల్సీకి రైతులు కలిసి గోడు వినిపించారు. దీనిపై ఆయన స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ఘనంగా బాడెన్ పావెల్ జయంతి

రామభద్రపురం: స్కౌట్స్, గైడ్స్ పితామహుడు రాబర్ట్‌బాడెన్ పావెల్ జయంతిని స్థానిక ఉన్నత పాఠశాలలో స్కౌట్స్, గైడ్స్ క్లబ్ నిర్వాహకులు పీడీ డి.శ్రీదేవి,వెంకటరావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు , విద్యార్థులు, బాడెన్ పావెల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎం.మురళీధరరరావు,ఉపాధ్యాయులు ఆర్.ప్రభాకరరావు, కె.దాలినాయుడు,డి.రఘురాంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు వైద్య పరీక్షలు



రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ఈశ్వరరావు

వంగర: మండలంలోని ఇరువాడలో 104 వాహన సిబ్బంది 55 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు అందజేశారు. శిబిరంలో వైద్యాధికారి కలమటి ఈశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ సౌజన్య, డీఈఓ రవి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

రాజాం సిటీ: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని విజయనగరానికి చెందిన వెయిట్ లిఫ్టర్ ఎర్ర చైతన్యకుమారి అన్నారు. జీసీఎస్ఆర్ కళాశాలలో శనివారం నిర్వహించిన క్రీడా వార్షికోత్సవానికి ఆమె హాజరయ్యారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. అనంతరం వివిధ క్రీడల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.పురుషోత్తమ్, జీఎంఆర్ ఐటీ పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్, సీహెచ్ రవీంద్రకుమార్, పీడీ సీహెచ్ కేశవనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు తలెత్తనీయొద్దు

రాజాం సిటీ: వస్తున్న వేసవి దృష్ట్యా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని శ్రీకాకుళం జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా ఎంపీడీఓ వి.శ్రీనివాసరావుకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆయన శనివారం తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. రికార్డుల నిర్వహణ, రికార్డు గదితో పాటు కార్యాలయ ఆవరణలో రూ.3 లక్షలతో నిర్మిస్తున్న మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం గా్రరాజుచీపురుపల్లి గ్రామాన్ని సందర్శించారు.

సైన్స్ ఎగ్జిబిషన్ పరిశీలన

రాజాం సిటీ: స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు శనివారం పరిశీలించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసేందుకు విజ్ఞానప్రదర్శనలు దోహదపడతాయన్నారు. పర్యావరణ హితమైన, ఆరోగ్యం, పరిశుభ్రత, గణిత నమూనాలపై చిన్నారులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించి అభినందించారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

రాజాం సిటీ: పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపడుతున్నామని టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ కూడలిలో శనివారం డ్రోన్ సర్వే నిర్వహించారు. ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

వంగర: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని సెక్టార్ ఆఫీసర్ వి.టి.రామారావు శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్య, సదుపాయాలు పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దిరిశాల ధర్మరాజు, ఎస్సై షేక్ శంకర్, ఏవో తట్టికోట కన్నబాబు, ఎంఈవో-2 ఖండాపు జగదీశ్వరి, ఆర్‌ఐ బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన బోధనకు శిక్షణ దోహదం

రాజాం: వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవడం వల్ల మెరుగైన బోధన సాగించవచ్చని ఎంఈఓ బి.ప్రవీణ్‌కుమార్ అన్నారు. రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు విద్యాబోధన పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. సులభ బోధన పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పాండ్రంకి నాగయ్య, రిసోర్సు పర్సన్‌లు వి.ఉషారాణి, కె.హరిప్రసాద్, వై.భాస్కర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఆర్.పి.ప్రసన్న పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



కోలాటం చేస్తున్న కళాకారులు

వంగర: రుషింగి గ్రామంలోని శ్రీ షిర్డిసాయి ఆలయ 18వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు యలకల మురళీకృష్ణ, దేవి దంపతుల ఆధ్వర్యంలో భక్తులు కుంకుమ పూజలు జరిపారు. భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ యలకల శ్రీనివాసరావు, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఆలయ ప్రారంభోత్సవం

వంగర: మండంలోని ఇరువాడలో శ్రీరామాలయ ప్రారంభోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమం జరిపారు. కలశ ఊరేగింపు చేపట్టారు. అర్చకుడు ఆరవెల్లి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రారంభోత్సవ పూజల్లో గ్రామస్తులు పాల్గొన్నారు.